• కొయ్యకాళ్లు కావివి.. జీవాలకు మేతగా వదిలిన పొలం



• చుక్కనీళ్లు లేక పురిట్లోనే గొర్రెలకు మేత



# ఎటు చూసినా నీటి తిప్పలే..

వనపర్తి జిల్లాలో రైతు సాకలి మహేశ్ నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. అయితే నీళ్లులేకపోవడంతో పంట ఎండిపోతున్నది. అప్పు తెచ్చి పంట సాగు చేస్తే చివరికి ఎండిపోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఏం చెయ్యాలో తెలియక పంటను పశువులకు వదిలేశాడు. దీంతో స్థానికులు తమ మేకలను ఆ పొలంలో మేపుతున్నారు. ఈ సందర్భంగా రైతు మహేశ్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి పంట పండిస్తే నీళ్లులేక ఎండిపోయిందని చెప్పాడు. చేసిన కష్టమంతా పోయిందని, చివరికి అప్పు మిగిలిందని కన్నీటిపర్యం అయ్యాడు. ఈ పరిస్థితి తనదొక్కడిదే కాదని, వనపర్తిలో ఎంతో మంది రైతులు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారని తెలిపాడు.



జాడలేని నీటి చుక్క.. ఎండిన మక్క..

కరీంనగర్ జిల్లాలో సాగునీరు అందడం లేదు. దీంతో పంటలు ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయి. ఎకరాల కొద్దీ పంట నేలపాలవుతున్నది. మానకొండూరు మండలం చెంజర్ల గ్రామశివారులో ఎండిన మక్కజొన్న పంట

సాగు నీరు లేక ఎండిన పొలాన్ని మేత కోసం జీవాలకు వదిలేశాడు మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం చండూర్ గ్రామ రైతు కుమ్మరి శేఖర్. తనకు ఉన్న రెండెకరాలతోపాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని యాసంగిలో వరి పంట వేశాడు. పంటను కాపాడుకోవడానికి రెండుబోర్లు తవ్వించాడు. ఒక బోరు 720 ఫీట్లు, మరో బోరు 550 ఫీట్లు తవ్వించినా చుక్కనీరు రాలేదు. దీంతో వరి పంట పూర్తిగా ఎండిపోతున్నది. ఎకరానికి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. చెరువుల నీళ్లుంటే బోర్లు పోసేవని, రూ.6 లక్షల వరకు అప్పులు అయినట్టు రైతు తెలిపాడు. మంజీరా నదిమీద చండూర్‌లో ఉన్న ఎత్తిపోతల ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి నీళ్లు అందిస్తే పొలాలు ఎండిపోయేవి కాదని చెప్తున్నాడు.



ఈసారి ఓట్లు వాటినే అడిగి వేయించుకోండి!

• ఎండిన పైరు.. రైతు కంట కన్నీరు



సిద్దిపేట రూరల్ మండలం సీతారాం పల్లి గ్రామంలో రైతు నర్సయ్య తన పొలంలో వరిని సాగు చేశాడు. అయితే నీళ్లు లేకపోవడంతో పంట ఎండుతున్నది. ఎండిన పంటను చూపిస్తూ ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న నర్సయ్య

• నామరూపాల్లేకుండా పోయిన నారు



సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం ఇసుజిపేట గ్రామంలో నీళ్లులేక బీటలు వారిన వరి చేను. ప్రభుత్వం సమయానికి నీళ్లు ఇవ్వకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని రైతు వాపోయాడు

• క్యాబేజీ రైతుకు ఎంత కష్టం!



వికారాబాద్ జిల్లా నవపేట్ మండలం చించల్పేట్ గ్రామంలో రైతు రమేశ్ తన పొలంలో క్యాబేజీని సాగు చేశాడు. నీళ్లులేకపోవడంతో పంట ఎక్కడికక్కడ ఎండిపోతున్నది. పంటను చూస్తూ అలాగే పొలంలో కూర్చొన్న రైతు

## బ్యాంకు వేధింపులు.. రైతు ఆత్మహత్యాయత్నం

- 27 ఏండ్ల కిందట తండ్రి తీసుకున్న రుణం కట్టాలని నోటీసు
- రుణం చెల్లించినట్టు చెప్పినా వినకుండా వేలానికి సిద్ధం
- తట్టుకోలేక పురుగుమందు తాగిన దివ్యాంగ రైతు వెంకన్న



చికిత్స పొందుతున్న గౌని వెంకన్న

నల్లగొండ, మార్చి 4: సహకార బ్యాంకు అధికారుల వేధింపులతో ఓ దివ్యాంగ రైతు ఆత్మహత్యకు యత్నించాడు. '27 ఏండ్ల కిందట మీ నాన్న తీసుకున్న రూ.40 వేల అప్పు ఇప్పుడు వడ్డీతో 1.68 లక్షలు అయ్యింది.. మీరు చెల్లిస్తే సరి.. లేదంటే భూమి వేలం వేస్తాం' అని బెదిరింపులకు దిగడంతో భయాందోళనకు గురై గడ్డిమందు తాగి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు సదరు రైతు. వివరాలు ఇలా.. నల్లగొండ జిల్లా కనగల్ మండలం గడ్డం వారి ఎడవెల్లికి చెందిన రైతు గౌని భిక్షమయ్య 1998లో ఎడవెల్లి ప్రాథమిక సహకార బ్యాంకులో పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్ పెట్టి రూ.40 వేలు రుణం తెచ్చుకున్నాడు. ఆ సమయంలో నాలుగెకరాల భూమిని బ్యాంకు వాళ్లు మార్టిగేజ్ చేసుకోగా, కొద్దిరోజులకు భిక్షమయ్య తీసుకున్న డబ్బులు చెల్లించి పాస్‌పుస్తకాలు తీసుకొచ్చాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మార్టిగేజ్ విషయమై అవగాహన లేక వదిలేసినట్టు వారు పేర్కొన్నారు. ఆ తర్వాత పాత పాస్‌పుస్తకాల స్థానంలో గత బీఆర్‌ఎస్ సర్కారులో ధరణి పాస్ పుస్తకాలు వచ్చాయి. వాటిని యూనియన్ బ్యాంకులో పెట్టి భిక్షమయ్య తన పేరు మీద రెండు లక్షల పంట రుణం తీసుకున్నాడు. కొంతకాలానికి ఆ మొత్తం తిరిగి చెల్లించి నాలుగేండ్ల కింద తన భూమిని కొడుకు వెంకన్న, కోడలు రాణి, మనమడు భానుప్రసాద్ మీద ఫౌతి చేశాడు. అనంతరం వెంకన్న, రాణి అదే బ్యాంకులో వ్యవసాయ అవసరాల కోసం 1.90 లక్షల రుణం తీసుకున్నారు. కాగా రెండ్రోజుల కిందట సదరు భూమి పీఏసీఎస్‌కు చెందిందని అంటూ సహకార బ్యాంకు అధికారులు జెండాలు పాతారు. ఈ నెల 19లోగా మొత్తం రుణం వడ్డీతోసహా చెల్లించాలని బెదిరింపులకు దిగారు. కలత చెందిన వెంకన్న సోమవారం ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రస్తుతం నల్లగొండ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు.

### రైతులను ఒత్తిడికి గురి చెయ్యొద్దు

సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులను తిరిగి కట్టాలని అధికారులు ఒత్తిడి చేయొద్దని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ సూచించారు.

• ఎంతతోడినా మట్టే.. నీటిజాడేది?



సాగునీళ్లు రాకపోవడంతో రైతులు బావుల వైపు చూస్తున్నరు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బురుజు బావి వద్ద బావిలో మట్టిని తోడిపిస్తున్న రైతు.

• క్రేనుతో 'పానీ'పాట్లు



కరీంనగర్ జిల్లాలో బావిని తవ్వేందుకు క్రెయిన్ ద్వారా లోపలికి దిగుతున్న రైతు మధు

• మళ్లీ ట్యాంకర్ల కాలం..



ఆదిలాబాద్ జిల్లాలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నీటి సరఫరా సరిగాలేకపోవడంతో ట్యాంకర్లకు ఎగబడుతున్నారు

• బండెనక బండి కట్టి.. నీటికి ఎదురెళ్లి..



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని తేజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నీటి సమస్య తీవ్రంగా ఉన్నది. దీంతో స్థానిక ఆదివాసీలు ఎడ్లబండ్లపై డ్రమ్ములను కట్టి నీళ్లు తెచ్చుకుంటున్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలో ఏర్పాటైన కొనుగోలు కేంద్రంలో పల్లీ కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

## గన్నీ బ్యాగులు లేవని పల్లీ కొనుగోళ్లు ఆపేసిండ్రు

ఉప్పునుంతల, మార్చి 4 : యాసంగి పల్లీ పంట కాలం పూర్తయిన తర్వాత ఆలస్యంగా మేల్కొన్న అధికారులు తాజాగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. తీరా పంటను తెచ్చిన తరువాత గన్నీ బ్యాగులు లేవంటూ కొనుగోళ్లు ఆపేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలో సోమవారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్లీ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆర్భాటంగా ప్రారంభించారు. ఇప్పటికే 90 శాతం పంటను తక్కువ ధరకు అమ్ముకొని రైతులు నష్టపోయారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు కావడం.. మద్దతు ధరకు కొంటున్నారని తెలుసుకొన్న సదగోడు, మొల్గర, ఇప్పకుంటతోపాటు పలు గ్రామాల రైతులు 2 వేల బస్తాలను ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో సోమ, మంగళవారాల్లో కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. అయితే గన్నీ బ్యాగులు లేకపోవడంతో పంటను అధికారులు కొనుగోలు నిలిపేశారు. చేసేదేమీ లేక రైతులు గోదాం వద్దే పడిగాపులు కాస్తున్నారు.



ధాన్యం డబ్బు లు చెల్లించాలని నల్లబెల్లిలోని ఐకేపీ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు గాజుల రాజేందర్

## ధాన్యం డబ్బులు చెల్లించాలని రైతు ఆందోళన

- వరంగల్ జిల్లా నల్లబెల్లిలో ఘటన
- ఎస్సై జోక్యంతో నిర్వాహకుల చెల్లింపు
- వెలుగులోకి వచ్చిన కాంగ్రెస్ నేత చేతివాటం!

నల్లబెల్లి, మార్చి 4: ధాన్యం డబ్బులు చెల్లించాలని ఓ రైతు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టాడు. ఈ సందర్భంగా బాధిత రైతు గాజుల రాజేందర్ మాట్లాడుతూ.. 309 బస్తాల ధాన్యాన్ని మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు విక్రయించగా, నిర్వాహకులు కేవలం రూ.లక్ష మాత్రమే చెల్లించి మిగతా డబ్బులు ఇవ్వకుండా మూడు నెలలుగా తిప్పుతున్నారని ఆరోపించాడు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని ఐకేపీ కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలితో మాట్లాడాడు. రైతుకు రావాల్సిన డబ్బుల్లో ప్రస్తుతం రూ.1.45 లక్షలు అక్కడికక్కడే ఇప్పించారు.

### కాంగ్రెస్ నాయకుడి చేతివాటం వల్లే..

ధాన్యం కొనుగోలుదారురాలి భర్త బత్తిని మహేశ్ (కాంగ్రెస్ నాయకుడు) తమకు సమాచారం ఇవ్వకుండా రాజేందర్‌కు చెందిన ధాన్యాన్ని ట్రాక్టర్ ద్వారా నేరుగా మిల్లుకు దిగుమతి చేసి, డబ్బులను తన ఖాతాలోకి మళ్లించుకొని తన సొంతానికి వాడుకున్నట్టు ఏపీఎం సునీతను తెలిపింది. రైతులకు సంబంధించిన సమాచారం తమ వద్ద లేకపోవడంతో డీఆర్‌డీఏతో పాటు సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ ద్వారా వివరాలు సేకరించడంతో మహేశ్.. రైతుల డబ్బులను వాడుకున్న విషయం బహిర్గతమైందని అన్నారు. ఇలా చాలా మంది రైతుల ధాన్యాన్ని నేరుగా మిల్లులకు విక్రయించి డబ్బులను తన ఖాతాలోకి మళ్లించుకొని ఆలస్యంగా రైతులకు చెల్లించడం జరిగిందని పేర్కొన్నారు. ఇదే గ్రామానికి చెందిన రమ అనే రైతుకు సంబంధించిన ధాన్యం డబ్బులు రూ.45 వేలకుపైగా మహేశ్ వాడుకున్నాడని తెలిపారు.



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిరసన తెలుపుతున్న పసుపు రైతులు

## మెట్‌పల్లిలో పసుపు రైతుల నిరసన

- మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్

మెట్‌పల్లి, మార్చి 4: పసుపునకు కనీస మద్దతు ధర రూ.15 వేలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. రైతు ఐక్యవేదిక నాయకులు మంగళవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు క్రయ,విక్రయాల తీరును పరిశీలించారు. పసుపునకు పలుకుతున్న ధరల తీరుపై నిరసన తెలిపారు. గిట్టుధర లభించక రైతు కనీసం పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు బోర్డు వచ్చినప్పటికీ మద్దతు ధర ప్రకటించకపోవడంతో నష్టపోతున్నట్టు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పసుపునకు కనీసం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకుంటామని కాంగ్రెస్ విడుదల చేసిన డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రేడ్ లైసెన్స్‌దారులు పెద్ద సంఖ్యలో మార్కెట్‌లో ఉన్నప్పటికీ కేవలం ఐదారుగురు మాత్రమే ఆన్‌లైన్ వేలంలో పాల్గొనడం బాధాకరమని, పోటీలేకపోవడంతో ఇష్టారీతిగా ధరలకు కొనుగోలు చేస్తుండటం వల్ల రైతులకు నష్టం జరుగుతుందని అన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మద్దతు ధరను ప్రకటించి నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో పసుపు కొనుగోలు చేయించి రైతులను ఆదుకోవాలని రైతు ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి, నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, మామిడి నారాయణరెడ్డి, మారు మురళీధర్‌రెడ్డి, యాళ్ల తిరుపతిరెడ్డి, కాటిపెల్లి నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.